
ప్రభాత
తెలుగు దినపత్రిక
# జయభేరి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
jayabherinews
JAYABHERIDAILY.COM
19-07-2024
శుక్రవారం
మల్కాజిగిరి
సంపుటి : 01 | సంచిక : 323 | పేజీలు : 8 | వెల : 4
JB జయభేరి



# రాష్ట్ర రైతాంగ చరిత్రలో.. ఇదొక అద్భుత ఘట్టం

- లక్ష లోపు రైతు రుణాలు మాఫీ
- అన్నం పెట్టే చెయ్యి.. యాచించే పరిస్థితి ఉండకూడదు
- సంబరాలు చేసుకున్న రైతులు
- ఏడు వేల కోట్ల రూపాయిలు చెల్లింపు
- కాంగ్రెస్ హామీ ఇస్తే... అది శిలాశాసనం

**జయభేరి, హైదరాబాద్, జూలై 18:**

తెలంగాణలోని రైతులకు రేవంత్ రెడ్డి సర్కారు గుడ్ న్యూస్ చెప్పింది. తొలి విడతలో లక్ష లోపు రుణాలను కాంగ్రెస్ ప్రభుత్వం మాఫీ చేసింది. సచివాలయంలోని ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సిఎం రేవంత్ రెడ్డి బటన్ నొక్కి క్లిక్ చేయగానే నేరుగా రైతులు ఖాతాల్లోకి ఏకకాలంలో రుణమాఫీ సొమ్ము జమ అయ్యాయి. సుమారుగా 11.42 లక్షల మంది లబ్ధిదారులకు రుణమాఫీ కింద సుమారు ఏడు వేల కోట్లు ప్రభుత్వం చెల్లించింది.రైతులు మూడు కేటగిరీలుగా విభజించి రుణమాఫీ చేయాలని సర్కారు నిర్ణయించింది. తొలి విడతలో లక్షలోపు రెండో విడతలో లక్ష యాభై వేలు వరకు, మూడో విడతలో 2 లక్షల వరకు రుణాలు మాఫీ చేయనుంది. బ్యాంకులు, పిఎసిఎస్ నుంచి ఇప్పటికే సేకరించిన వివరాలన్నింటినీ నేషనల్ ఇన్ఫర్మేషన్ ఇస్తున్నారు. మొత్తంగా రుణమాఫీ పరిధిలోకి వచ్చే రైతు కుటుంబాలు 40 లక్షలు ఉన్నట్లు లెక్క తేలింది. లక్షలోపు రుణాలు ఉన్న రైతులు వివరాలను జిల్లాల వారీగా బుధవారం సాయంత్రమే కలెక్టర్లు, డిఎవోలకు పంపించారు.

...మిగతాది 2 లో

# రేవంత్.. పారిపోయే చరిత్ర నీది

## నాకు రాజీనామా కొత్తకాదు : సీఎంకు హరీశ్ రావు కౌంటర్



**జయభేరి, హైదరాబాద్ :**


ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి తాను చేసిన సవాల్‌పై బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి టీ హరీశ్ రావు స్పందించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రూ.2 లక్షల వరకు వ్యవసాయ రుణాల మాఫీతో పాటు 13 హామీలతో కూడిన ఆరు కీలక హామీలను ఆగస్టు 15 నాటికి పూర్తిగా అమలు చేయగలిగితే రాజీనామా చేస్తానని పేర్కొన్నారు. మీరు హామీలను పూర్తి స్థాయిలో నెరవేర్చితే నేను రాజీనామా చేయడానికి సిద్ధంగా ఉన్నాను' అని అన్నారు. లేని పక్షంలో రాజీనామా చేసేందుకు ముందుకు వస్తారా లేదా అన్నది ముఖ్యమంత్రి చెప్పాలన్నారు.
''నాకు పదవులు కొత్త కాదు. రాజీనామాలు కూడా కొత్త కాదు. ప్రజలకు, రైతులకు, పేద, అణగారిన వర్గాలకు సాధ్యమైన మేలు చేస్తాను. నేను రాజీనామా చేయడానికి వెనుకాడను' అని.. తాను ఎమ్మెల్యే పదవులకు, పార్టీలో మంత్రి పదవికి కూడా రాజీనామా చేశానని అన్నారు.
రాష్ట్ర సాధన కోసం పోరాడుతున్న సమయంలో రాజీనామాకు దూరంగా ఉన్న వ్యక్తి రేవంత్ రెడ్డి. 2018 ఎన్నికల్లో కొడంగల్‌లో ఓడిపోతే రాజకీయాల నుంచి తప్పుకుంటానని రేవంత్‌రెడ్డి సవాల్ చేశారని.. కానీ ఆయన ఆ మాట మీత నిలబడలేదని అన్నారు.
ఇదిలావుంటే.. తెలంగాణ సచివాలయంలో గురువారం జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రుణమాఫీ నిధులను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతు రుణమాఫీతో దేశంలోనే తెలంగాణ రోల్ మోడల్‌గా నిలిచిందని అన్నారు. ఒకరు గుజరాత్ మోడల్ అని.. మరొకరు ఇంకో మోడల్ అంటున్నారు.. కానీ నేడు తెలంగాణ మోడల్ దేశంలోని రైతులకు, రాజకీయ పార్టీలకు స్ఫూర్తిదాయకంగా మారబోతోందన్నారు. సవాళ్లు విసిరిన వారు.. మేము మిమ్మల్ని రాజీనామా చేయమని అడగడం లేదు.. ఎందుకంటే మీరు ఎలాగైనా పారిపోతారని హరీశ్ రావును ఉద్దేశించి వ్యాఖ్యానించారు.



# కవితకు వైద్య పరీక్షలు

**జయభేరి, న్యూఢిల్లీ జూలై 18:**

ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో అరెస్టయ్యి తీహార్ జైలులో ఉన్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు వైద్య పరీక్షలు చేయించాలని కోర్టు ఆదేశించింది. కవితకు అనారోగ్యంగా ఉండటంతో మంగళవారం ఢిల్లీలోని ధీన్ దయాల్ ఆస్పత్రికి తరలించారు. దీంతో కవితకు వైద్య పరీక్షల కోసం ట్రయల్ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.




# సమస్యలు పరిష్కారానికి యువనేత చొరవ

- కష్టాల్లో ఉన్న వారికి నేనున్నానంటూ నారా లోకేష్ భరోసా
- 18వ రోజు "ప్రజాదర్బార్" కు పెద్దఎత్తున తరలివచ్చిన ప్రజలు

**జయభేరి, అమరావతి:**

కష్టాల్లో ఉన్న వారికి నేనున్నానంటూ విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ భరోసా ఇస్తున్నారు. సమస్యల పరిష్కారానికి అక్కడికక్కడే సిబ్బందికి ఆదేశాలు జారీ చేస్తున్నారు. దీంతో తమ సమస్యలు చెప్పుకునేందుకు మంగళగిరితో పాటు రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు "ప్రజాదర్బార్" కు పెద్దఎత్తున తరలివచ్చారు. ఉండవల్లిలోని నివాసంలో 18వ రోజు "ప్రజాదర్బార్"లో ప్రతి ఒక్కరిని కలిసిన మంత్రి.. వారి నుంచి విన్నపాలు స్వీకరించారు. ఆయా సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని భరోసా ఇచ్చారు. మాజీ ఎంపీ నందిగం సురేష్‌కు చెందిన టిప్పర్ లారీ ఢీకొని నాలుగేళ్ల తన మనవడు దుర్మరణం పాలయ్యాడని, తగిన న్యాయం చేయాలని మంగళగిరి నియోజకవర్గం తాడేపల్లికి చెందిన తాళ్ల నాగరాజు మంత్రి నారా లోకేష్ ను కలిసి కన్నీటిపర్యంతమయ్యారు. పాఠశాల నుంచి తన మనవడిని ద్విచక్రవాహనంపై తీసుకువస్తుండగా ఉండవల్లి సెంటర్ వద్ద టిప్పర్ లారీ ఢీకొనడంతో అక్కడికక్కడే

...మిగతాది 2 లో




# కన్న కూతురిపై కీచక తండ్రి లైంగిక దాడి

- మేడిపల్లి పోలీసుల అదుపులో నిందితుడు
- పోక్సో కేసు నమోదు చేసిన పోలీసులు

**- జయభేరి, మేడిపల్లి జూలై 18:**

కన్న కూతురిపై లైంగికదాడికి పాల్పడిన కీచకుడిని పోలీసులు అరెస్టు చేసిన సంఘటన రాచకొండ కమీషనరేట్ పరిధిలోని మేడ్చల్ జిల్లా మేడిపల్లి పిఎస్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మేడిపల్లిలోని సాయి నగర్ లో నివాసం ఉంటున్న ఓ వ్యక్తి తన కుటుంబంతో కలిసి ఉంటున్నాడు. హస్టల్ లో ఉండి చదువుకుంటున్న తన మైనర్ కూతురును ఇంటికి తీసుకొచ్చి ఇంట్లో తల్లి లేని సమయంలో బాలికపై బలాత్కారం చేశాడు. అనంతరం జరిగిన విషయం పక్కింటి మహిళకు తెలియడంతో పోలీసులకు సమాచారం ఇచ్చింది. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు దర్యాప్తు జరిపి నిందితుడిని అదుపులోకి తీసుకుని పోక్సో చట్టం ప్రకారం కేసు నమోదు చేశారు. ఈ రోజు మెజిస్ట్రేట్ ముందు హాజరుపరిచి రిమాండ్ కు తరిలిస్తామని పోలీసులు తెలిపారు.



# జో బైడెన్‌కు కరోనా వైరస్

**జయభేరి, న్యూయార్క్ జూలై 18:**

అమెరికా అధ్యక్షుడు జో బైడెన్‌కు కరోనా వైరస్ సోకింది. దగ్గు, జలబు, స్వల్ప అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నట్టు వైట్ హౌస్ ఓ ప్రకటనలో వెల్లడించింది. డెలావేర్ సముద్ర తీరంలోని తన ఇంట్లో చికిత్స తీసుకుంటున్నట్లు పేర్కొంది. బైడెన్‌కు పాక్స్‌లోవిడ యాంటి వైరస్ డ్రగ్ ఇచ్చినట్లు వివరించింది. ఇవాళ ఆయన యునిడోస్‌లో ప్రచారం ప్రసంగించాల్సి ఉండగా అర్థంతరంగా ఆ పర్యటనను నిలిపివేసి డెలావేర్ కు బయలుదేరారు.

# ఈ నెల 23 నుంచి శాసనసభ

- 24 నుంచి శాసనమండలి సమావేశాలు
- 25 లేదా 26వ తేదీల్లో బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్న ప్రభుత్వం

**జయభేరి, హైదరాబాద్, జూలై 18:**

శాసనసభ, మండలి సమావేశాలకు నోటిఫికేషన్ జారీ అయింది. ఈ నెల 23 నుంచి శాసనసభ, 24 నుంచి శాసనమండలి సమావేశాలు ప్రారంభం కానున్నాయి. 23న ఉదయం 11 గంటలకు శాసనసభ ప్రారంభం కానుంది. శాసనసభ సమావేశాల నేపథ్యంలో జులై 25 లేదా 26వ తేదీల్లో బడ్జెట్‌ను ప్రవేశ పెట్టనుంది కాంగ్రెస్ ప్రభుత్వం. పది రోజుల పాటు అసెంబ్లీ నిర్వహించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. ఈ పది రోజుల్లో రైతు భరోసా, కొత్త ఆర్ఓఆర్ చట్టం, తెలంగాణ లోగో మార్పు, తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటుతో పాటు పలు బిల్లులపై అసెంబ్లీలో చర్చించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల నేపథ్యంలో గత కొద్ది రోజుల నుంచి డిప్యూటీ సీఎం, ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క ఆయా శాఖల అధికారులతో వరుసగా చర్చలు నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. ఏయే శాఖలకు కేటాయింపులు ఎలా జరపాలనే అంశంపై సుదీర్ఘ కసరత్తు చేస్తున్నారు అధికారులు.



# రుణమాఫీ సరే మరి..

## రుణ విముక్తి చట్టం అవసరం లేదా..!?

కౌంటర్ విత్ కదారి శ్రీనివాస్

...మిగతాది 2 లో

▶▶ మొదటిపేజీ తరువాయి

## రాష్ట్ర రైతాంగ చరిత్రలో..
## ఇదొక అద్భుత ఘట్టం

ప్రజాభవన్ రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల సమావేశాన్ని ప్రభుత్వం నిర్వహించింది. లక్షలోపు రుణమాఫీకి ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలనే అంశంపై బ్యాంకర్లకు డిప్యూటీ సీఎం దిశా నిర్దేశం చేశారు. మాఫీ అయిన మేరకు మళ్ళీ కొత్తగా పంట రుణాలు ఇవ్వడంపై ఆదేశాలు ఇచ్చారు. రైతు బంధు మాదిరిగానే ఈ కుబేర్ సాఫ్ట్వేర్ సాయంతో రుణమాఫీ నిధులను రైతుల ఖాతాల్లోకి జమ చేయనున్నారు. ఈ మేరకు వ్యవసాయ శాఖ డైరెక్టర్ గోపి ఇప్పటికే ప్రొసీడింగ్స్ తీసి ట్రెజరీకి పంపించారు. రుణమాఫీకి శ్రీకారం చుట్టే కార్యక్రమంలో భాగంగా రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాలకు చెందిన 20 మంది రైతులకు సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రులు కలిసి చెక్కులు పంపిణీ చేస్తారు. వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎం రేవంత్ రెడ్డి రైతులను ఉద్దేశించి మాట్లాడతారు. ఈ నెలాఖరులోపు రూ.1.5 లక్షలు వరకు ఉన్న రుణాలు ఆగస్టు మొదటి వారంలో రెండు లక్షల వరకు ఉన్న రుణాలను మాఫీ చేసేలా ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించింది.మొత్తం రుణమాఫీకి రూ.31 వేల కోట్ల అవసరమవుతాయని అంచనాలు ఉండగా, ప్రస్తుతం వెచ్చిస్తున్న రూ.7 వేలు కోట్లు కాకుండా మరో రూ.24 వేల కోట్లను ప్రభుత్వం సర్దుబాటు చేయాల్సి ఉంటుంది. ఖరీఫ్ సీజన్లోనే రుణమాఫీ పూర్తి చేస్తే మళ్లీ రైతుల పంట రుణం తీసుకునే అవకాశం ఉంటుందని ప్రభుత్వం భావిస్తోంది. అనుకున్నది అనుకున్నట్లు జరిగితే పంద్రాగస్టులోపు రైతులు రుణం నుంచి విముక్తులు కానున్నారు. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న రైతు వేదికలు, మండల కేంద్రాల్లో సంబరాలు చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చింది. రుణమాఫీ నిధులు జమ చేసిన రైతులను ఉద్దేశించి సీఎం రేవంత్ మాట్లాడనున్న వేళ రైతు వేదికలో వీడియో కాన్ఫరెన్స్ యూనిట్లు సిద్ధం చేశారు. ఎక్కడకక్కడ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, ప్రజాప్రతినిధులు ఈ సంబరాల్లో పాల్గొన్నారు. రుణమాఫీకి జాతీయ సహకార అభివృద్ధి సంస్థ (ఎన్సీడీసీ) రుణం తీసుకోవాలని రేవంత్ రెడ్డి ప్రభుత్వం నిర్ణయించింది. రైతుల రుణమాఫీ పథకాన్ని అమలు చేయాలని సంకల్పించిన రేవంత్ సర్కార్ ఆర్థిక వనరులను సమకూర్చుకునే దిశలో తీవ్ర ప్రయత్నాలను చేసింది. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసే రైతు రుణమాఫీ పథకానికి మొత్తం రూ.31 వేల కోట్లు అవసరమవుతాయని ప్రాథమిక అంచనా. ఇప్పటికే భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్బీఐ) నిర్వహించే ఈ వేలం ద్వారా ప్రతినెల సేకరించే మార్కెట్ రుణాలు, రాష్ట్ర రాబడుల నుంచి కొంత మేర నిధులను ఆదా చేస్తూ.. రుణమాఫీ కోసం దాదాపు రూ.10 వేల కోట్లకుపైగా ఖజానాలో జమ చేశారు. ఈ క్రమంలో మరో రూ.5 వేల కోట్లు సేకరించేందుకు ఎన్సీడీసీ రుణాలు తీసుకోవాలని నిర్ణయించింది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరుపుతోంది. ఈ రుణం నిధులను జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసిసిబి) ద్వారా రుణమాఫీకి వినియోగించాలని యోచిస్తోంది. అయితే, ఎన్సిడిసి నుంచి ఇంకా రాష్ట్ర ప్రభుత్వానికి ఎలాంటి ఆమోదం రాకపోవడంతో కేంద్ర సహకార శాఖను పర్యవేక్షిస్తున్న కేంద్ర హోం మంత్రి అమిత్ షాతో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సంప్రదింపు జరుపుతున్నారు.రాష్ట్రంలోని తొమ్మిది జిల్లా సహకార బ్యాంకులు, 908 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు ద్వారా రైతులకు ఇచ్చిన పంట రుణాలు దాదాపు 5 వేల కోట్ల వరకు ఉన్నాయి. ఈ బ్యాంకులు, సంఘాలు, తెలంగాణ సహకార అపెక్స్ బ్యాంకు (టీజీసీఏబీ)కు అనుసంధానమై ఉంటాయి. అందుకే ఎన్సీడీసీ నుంచి ముందుగా టిజిసిఏబి ఈ రూ.5000 కోట్ల రుణాన్ని తీసుకునేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. టీజీసిఏబి నుంచి జిల్లా సహకార బ్యాంకులో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు రుణం సొమ్మును మళ్ళించాలని సర్కారు యోచిస్తోంది. దేశంలో సహకార రంగాన్ని బలోపేతం చేయడానికి ఏర్పాటు చేసిన ఎన్సిడిసి రాష్ట్రాల్లోని టిజిసిఏబి వంటి బ్యాంకులకు రుణాలు ఇస్తుంటుంది.కానీ, ఈసారి రాష్ట్ర ప్రభుత్వమే మధ్యత్వం నెరుపుతూ టీజీసీఏబికి రూ.5000 కోట్ల రుణం ఇప్పించాలని ప్రయత్నిస్తోంది. ఈ రుణం లభిస్తే రుణమాఫీ విషయంలో రాష్ట్ర ప్రభుత్వానికి పెద్ద ఊరట లభించనున్నది. ఏది ఏమైనా తెలంగాణ ప్రభుత్వం రైతులకు రుణమాఫీ విషయంలో ముందుకు వెళుతూ ఉండడం పట్ల రైతాంగం నుంచి హర్షం వ్యక్తం అవుతోంది. మూడు విడతల్లో సుమారు రూ.31 వేల కోట్ల రూపాయలతో రుణమాఫీ పథకాన్ని అమలు చేసేందుకు అనుగుణంగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం శరవేగంగా కదులుతుండడం కీలక పరిణామంగానే పలువురు విశ్లేషిస్తున్నారు.

**రైతుల సంబరాలు**

రుణ మాఫీతో తెలంగాణ రైతులు సంబరాలు చేసుకుంటున్నారు. గత ప్రభుత్వాలు చేయలేని పనిని.. కాంగ్రెస్ సర్కార్ చేసి చూపించిందని ఆనందం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్నదాతల రుణ మాఫీ సంబరాలు అంబరాన్నంటాయి. మొదటి విడత ప్రకటించిన జాబితాలో వారి రుణాలు మాఫీ అవుతుండడంతో రైతులు ఆనందంతో ఉప్పొంగి పోతున్నారు. పంట పొలాల్లోనే కేక్ కట్ చేసుకుని మిఠాయిలు పంచుకున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి కృతజ్ఞతలు తెలుపుతూ సంబరాలు జరుపుకుంటున్నారు.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతుల రుణ మాఫీ మొదటి లిస్టు ప్రకటించడంతో ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా రైతులు ఆనందంతో ఉప్పొంగి పోయారు. సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతూ వినూత్న రీతిలో సంబరాలు జరుపుకుంటున్నారు . జనగామ జిల్లా దేవరుప్పుల మండలంలో రైతులు హర్షం వ్యక్తం చేస్తూ వినూత్న రీతిలో సంబరాలు జరుపుకున్నారు. లక్ష రూపాయల తీసుకున్న రైతుల రుణాలు మాఫీ అవుతుండటంతో సంతోషం వ్యక్తం చేస్తూ వారి వ్యవసాయ క్షేత్రంలోని నారుమడుల్లో సీఎం రేవంత్ రెడ్డి , వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చిత్రపటాలకు పాలాభిషేకం చేసి సంబరాలు జరుపుకున్నారు.. అనంతరం రైతులంతా కలిసి అదే పొలంలో నాగలి గొర్రు కర్రకు కాంగ్రెస్ జెండాను కట్టి ఎగరవేశారు. పంట పొలాల్లో చుట్టుపక్కల రైతులంతా కలిసి కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు..రుణమాఫీ అవుతున్న ఆనందంతో కేరింతలు కొడుతూ పశువులకు తిలకం దిద్ది ఒకరికొకరు అలయ్ బలయ్ చేసుకుంటూ మిఠాయిలు పంచుకున్నారు. రుణమాఫీ విషయంలో గత ప్రభుత్వాలు మాటలకే పరిమితమయ్యాయన్నారు ఖమ్మం ఎంపీ రఘురామరెడ్డి. ఇచ్చిన మాటకు కట్టుబడి కాంగ్రెస్ ప్రభుత్వం... రైతులకు ఇవాళ లక్ష రుణమాఫీ చేస్తోందన్నారు. అటు దేవరుప్పుల మండలంలో పంట పొలాల్లోనే కేక్ కట్ చేసారు రైతులు. గ్రామ గ్రామాన ఇదే రీతిలో కాంగ్రెస్ శ్రేణుల ఆధ్వర్యంలోనూ వేడుకలు గ్రాండ్‌గా జరగున్నారు. అటు మెదక్ జిల్లా చిన్న శంకరంపేట మండలం కొరవిపల్లి గ్రామంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి రైతులు పాలాభిషేకం చేశారు. రుణ మాఫీ హామీ ఇచ్చి తమకు ఆర్థికంగా అండగా నిలిచినందుకు ధన్యవాదాలు చెప్పారు.

## సమస్యలు పరిష్కారానికి యువనేత చొరవ

మృతి చెందాడని, ప్రమాదంలో తన కాలు విరిగిందని తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. నందిగం సురేష్ పేరు చెప్పి డ్రైవర్ బెదిరించాడని వాపోయారు. విచారణ జరిపి దోషులకు కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. సమస్యను విన్న లోకేష్.. పరిశీలించి తగిన న్యాయం చేస్తామని భరోసా ఇచ్చారు.
తప్పుడు దస్తావేజులతో స్థలాన్ని విక్రయించారు. తప్పుడు దస్తావేజులతో తమ నివాస స్థలాన్ని విక్రయించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మంగళగిరి నియోజకవర్గం ఉండవల్లికి చెందిన భవనాశి రాజరాజేశ్వరి నారా లోకేష్ ను కలిసి విజ్ఞప్తి చేశారు. దుగ్గిరాల మండలం శృంగారపురంలో మట్టి రోడ్ల కారణంగా ఇబ్బందులు పడుతున్నామని, వర్షాకాలంలో మరీ అధ్వానంగా మారాయని, సీసీ రోడ్లు నిర్మించాలని గ్రామ సర్పంచ్ యలవర్తి అంకమయ్య కోరారు. పుట్టకతోటే రెండు కిడ్నీలు పాడైపోయిన తమ కుమారుడికి వైద్యం సాయం అందించి ఆదుకోవాలని మంగళగిరి పట్టణానికి చెందిన తాళ్లూరి శిరీష విజ్ఞప్తి చేశారు. ప్రమాదంలో కాలు కోల్పోయిన తనకు వికలాంగ పెన్షన్ మంజూరు చేసి ఆదుకోవాలని సీతానగరానికి చెందిన ఎన్.సూరిబాబు కోరారు. అనారోగ్యంతో బాధపడుతున్న తన 8 నెలల కుమారుడికి వైద్యం సాయం చేయాలని తాడేపల్లికి చెందిన పఠాన్ అల్లాబీ విజ్ఞప్తి చేశారు. ఏపీఎస్ఆర్టీసీలో డ్రైవర్ గా పనిచేస్తున్న తనకు పిల్లల చదువు భారంగా మారిందని, రేషన్ కార్డు మంజూరు చేయాలని కృష్ణా జిల్లా బాపులపాడుకు చెందిన వి.విజయ్ కుమార్ విజ్ఞప్తి చేశారు. పెదకాకాని మండలం నంబూరులో తమ స్థలాన్ని ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని విజయవాడకు చెందిన ఎస్.నరేంద్ర కుమార్ విజ్ఞప్తి చేశారు. ఆయా సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని లోకేష్ భరోసా ఇచ్చారు.

# రుణమాఫీ సరే మరి
# రుణ విముక్తి చట్టం అవసరం లేదా..!?

- ▶▶ రుణ విముక్తి చట్టం, మద్దతు ధరల చట్టం
- ▶▶ ఈ రెండు చట్టాలు అమలు చేయాలని దేశంలో ఒక ఉద్యమం కొనసాగుతోంది.
- ▶▶ డాక్టర్ స్వామినాథన్ కమిషన్ ఏం చెబుతోంది!?
- ▶▶ ఎస్ ఎల్ బిసితో సీఎం రేవంత్ రెడ్డి మూడుసార్ల సమావేశం చేసిన ఇంకా లెక్క తేలని రైతుల సంఖ్య ఎంత...!?
- ▶▶ రేషన్ కార్డు ప్రమాణికము అని చెప్పిన రేషన్ కార్డు లేనివారికి సైతం రుణమాఫీ రైతుల్లో హర్షతిరేకం....
- ▶▶ రైతు రుణ విముక్తి చట్టం రైతు మద్దతు ధర చట్టం ఇలాంటి ఎన్నో రైతు సమస్యలపై జయభేరి సగర్వంగా సంధిస్తున్న కౌంటర్ విత్ కదారి శ్రీనివాస్ రాజకీయ సమగ్ర విశ్లేషణ....




✍ జయభేరి, హైదరాబాద్ :

తెలంగాణ రాష్ట్రంలో చారిత్రాత్మకమైన నిర్ణయానికి శ్రీకారం చుట్టారు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి. తెలంగాణలో 33 జిల్లాల రైతు వేదికల ద్వారా ఒకేసారి రుణమాఫీ పండుగను అమలు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం 11 వేల కోట్ల నిధులను రైతు రుణమాఫీకి వెచ్చించింది. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం సెంట్రల్ లో ఉన్నప్పుడు మన్మోహన్ సింగ్ 72,000 కోట్లు చేస్తే ఈసారి అదే కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రంలో పదకొండు వేల కోట్లు విడుదల చేస్తే 11 లక్షల కుటుంబాలకు ఒక్క కుటుంబానికి లక్ష రూపాయల చొప్పున రుణమాఫీని మొదటి విడతగా చేసి ఈనెల ఆఖరిన 50,000 రెండో విడతగా మాఫీ చేసి ఆగస్టు మొదటి వారంలో మరో 50,000 రుణమాఫీ చేయనుంది తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం. రైతు రుణమాఫీ గురించి ఎన్నికల సమయంలో వరంగల్ సభలో రాహుల్ గాంధీ సమక్షంలో డిక్లరేషన్ ఏర్పాటు చేసిన కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోను కూడా పెట్టింది.
ఎన్నికల తరువాత ఇచ్చిన మాటను తూచా తప్పకుండా మొదటి విడత ఏకంగా లక్ష రూపాయలను మాఫీ చేస్తూ మేనిఫెస్టోను అమలుపరిచింది. నిజంగా ఇది చారిత్రాత్మకమైన విజయమని కాంగ్రెస్ వ్యవసాయ ఆధారిత పెద్దలు కితాబునిచ్చిన దాని వెనక ప్రతిపక్షాలు గగ్గోలు పెడుతూనే ఉన్నాయి.. రేషన్ల కార్డు లేని వారి పరిస్థితి ఏమిటి? ఒకవేళ రైతు రుణమాఫీ పత్రంలో సమస్యలు ఏర్పడితే ఎవరు తీరుస్తారు అనే విషయాలపై బిఆర్ఎస్ పార్టీ అనేక ప్రశ్నలను సంధిస్తోంది. వీటన్నింటికీ సమాధానం చెబుతూ రేషన్ కార్డుతో సంబంధం లేకుండా అర్హులైన ప్రతి రైతుకు రెండు లక్షల రుణమాఫీ జరుగుతుంది అని ప్రభుత్వం చెబుతూనే ఉంది. ఇంకా ఇక్కడ మాట్లాడుకోవడానికి మాట్లాడ్డానికి విషయాలు ఏమీ లేవు...
రుణమాఫీ విషయంలో ప్రభుత్వ మార్గదర్శకాలను విడుదల చేసింది ఎవరికైనా సందేహాలు సమాధానాలు ఉండి రుణమాఫీ జరగకపోతే డైరెక్ట్ గా తమ అభ్యంతరాలను సంబంధిత బ్యాంకు ఆఫీసర్లతో మండలంలో నోడల్ ఆఫీసర్లతో మాట్లాడి తమ సమస్యను పరిష్కరించుకోవచ్చు అని ప్రభుత్వం చెబుతోంది.
దాదాపు 79 శాతం రైతు కుటుంబాలు అప్పుల ఊబిలో కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్న ఇలాంటి పరిస్థితుల్లో రుణమాఫీతో దాదాపు 11:30 లక్షల రైతులకు రుణమాఫీ జరగడం ఇది కాంగ్రెస్ ప్రభుత్వం లో జరిగిన చారిత్రాత్మకమైన విషయంగా అభివర్ణిస్తున్నారు కాంగ్రెస్ సీనియర్ లీడర్లు..
ఇక ఎస్ఎల్బీసీ విడుదల చేసిన ప్రకారం సీఎం రేవంత్ రెడ్డి ఎస్ఎల్బీసీ సమావేశాన్ని మూడుసార్లు ఏర్పాటు చేసి అనేక లెక్కలను కూడా తీశారు



✍ కదారి శ్రీనివాస్
కాలమిస్ట్, సీనియర్ జర్నలిస్ట్, కవి, రచయిత
గాయకులు, సామాజిక ఉద్యమకారులు

దాదాపు 79 లక్షల చిన్న సన్నకారు రైతులకు రుణ విముక్తి లభించేలా చర్యలు తీసుకున్నారు. అయితే మరి మిగతా వాళ్ళ పరిస్థితి ఏంటి!? అనే విషయాన్ని ప్రభుత్వం మరొకసారి ఆలోచన చేస్తే మంచిది. రైతులకు రుణ విముక్తి కలిగించే విషయంలో కేంద్ర ప్రభుత్వం కొంత సహాయం చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వాల్లో జరిగిన ప్రభుత్వంలో అంతగా ఆశించిన స్థాయిలో రైతు రుణమాఫీ జరగలేదు కానీ కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న రుణమాఫీ కొత్త ఏమీ కాదు ఆనాడు చేసిన రుణమాఫీ ఈనాడు చారిత్రాత్మకమైన రుణమాఫీ నిర్ణయంతో రైతుల సంతోషాలకు కారణమవుతోంది. గత ప్రభుత్వంలో నాలుగు విడతలుగా కొంత కొంత రుణ విముక్తి చేయగా రెండవ దశలో 20, 25 వేల రూపాయలతోనే సరిపెట్టుకుని గత ప్రభుత్వం. కానీ రాష్ట్ర ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి సారధ్యంలో డైరెక్టుగా ఒక లక్ష రూపాయలు మాఫీ అయిన తర్వాత ఇదే నెల చివరి వారంలో 50,000 మూడో విడత ఆగస్టు మొదటి వారంలోనే మరో 50 వేలుతో మూడు విడుదల్లో రెండు లక్షల రూపాయలను రైతులకు రుణమేముక్తి చేసింది రేవంత్ రెడ్డి ప్రభుత్వం.

**రైతు రుణమాఫీ చేస్తున్నప్పుడు సీఎం రేవంత్ రెడ్డి ఒక ప్రసంగాన్ని చేశారు సార్వత్రా ఇప్పుడు అదే విషయం చేర్చాంశం నియమౌవుతుంది. రెండు లక్షల కు పైగా ఋణం ఉన్నవాళ్లు కచ్చితంగా రెండు లక్షల పైన ఉన్న రుణాన్ని చెల్లించాలని రైతు రుణమాఫీ జరిగిన వాళ్ళు ఖచ్చితంగా మళ్ళీ తీసుకున్నప్పుడు బ్యాంకులకు విడుదలవారీగా చెల్లింపులు జరపాలని ఇప్పుడు జరిగిన రైతు రుణమాఫీ ప్రపంచవ్యాప్తంగా దేశవ్యాప్తంగా చర్చ జరగాలని ఆశించారు. రాష్ట్ర ప్రభుత్వం 7500 ఎకరానికి సంవత్సరానికి ఇస్తున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వ పెట్టుబడి ఇస్తున్న రైతుకు ఇంకా రుణమాఫీ అవసరమా అనే వాదన వినపడుతూనే ఉంది.**


**రైతుకు పూర్తిగా రుణమాఫీ జరగాలంటే ఏం చేయాలి...**

**కేరళ తరహా రైతు రుణ విముక్తి చట్టాన్ని తీసుకురావాలని రైతాంగ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. డాక్టర్ స్వామినాథన్ కమిషన్ ప్రకారం రైతు బ్యాంకు నుంచి రుణాన్ని తీసుకున్నప్పుడు తిరిగి చెల్లించాల్సిన విషయంలో అశ్రద్ధ వహించకుండా దశలవారీగా చెల్లింపులు జరిపితే బాగుంటుంది అని కమిషన్ అభిప్రాయాన్ని వెలిబుచ్చింది. అయితే ఇదే స్వామినాథన్ కమిషన్ 50%పెట్టుబడిలో కలిపి రైతును ఆదుకోవాలని కూడా సూచించింది. అంటే మొదటిదిగా మద్దతు ధరల గ్యారెంటీ చట్టం రెండవదిగా రైతు రుణ విముక్తి చట్టాన్ని కచ్చితంగా రాజ్యాంగపరంగా హక్కుగా చేయాలని రైతాంగ నిపుణులు పెద్దలు అభిప్రాయపడుతున్నారు. ఇదే గనక జరిగితే రైతుకు రుణమాఫీ అంత పెద్ద విషయమేం కాదని రైతు తనకు తానుగా స్వతంత్రంగా బతకడానికి తాను పండించిన పంటకు మద్దతు ధర కలిగితే గనక కచ్చితంగా ఋణ విముక్తిని కోరుకోడు తానే తిరిగి చెల్లించే అవకాశం ఉంటుంది అని అభిప్రాయపడుతున్నారు.**

**బిఆర్ఎస్ ప్రభుత్వం రైతుబంధు పేరుతో ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసిందా!?**

గత ప్రభుత్వం రైతు బంధు పేరుతో ఓఆర్ఆర్ పక్కన ఉన్న అనేక గుట్టలు చెట్లు రాళ్లు రప్పలు ఉన్న భూముల కూడా లక్షల కోట్ల రూపాయలను రైతుబంధు పేరుతో తెలంగాణ సంపదను ధనికులకే పంచి పెట్టింది అని అధికార ప్రభుత్వం గట్టిగా వాదిస్తోంది. అందుకే ఈసారి రైతాంగ వేదికల ద్వారా రైతు భరోసా కార్యక్రమం ద్వారా డిప్యూటీ సీఎం ఆధ్వర్యంలో అనేక చోట్ల మీటింగ్లను ఏర్పాటు చేస్తూ రైతుల నుంచి మేధావుల నుంచి విజ్ఞానుల నుంచి సూచనలను తీసుకుంటూ తగిన విధంగా రైతు రుణమాఫీకి శ్రీకారం చుడుతోంది. గత ప్రభుత్వం చేసిన తప్పులను చేయకుండా అనేక విధమైన ఆలోచనలతో రైతుల నుంచి ఎన్నో అంశాలను పరిగణలోకి తీసుకొని రేషన్ కార్డు ఉన్నవారికి రేషన్ కార్డు లేకుండా అర్హులైన వారికి కచ్చితంగా రెండు లక్షల రుణమాఫీని అమలు చేస్తుంది.
ఇక కేంద్ర ప్రభుత్వం 10 సంవత్సరాల ప్రభుత్వంలో 2021, 22 సంవత్సరంలో ప్రపంచ స్థాయి తాకేలా రైతాంగ పోరాటాలు చేసిన ప్రధానమంత్రిగా కొనసాగుతున్న మోడీ హామీలు ఇచ్చి వాటిపై ఎలాంటి నిర్ణయం కూడా తీసుకోకపోవడం దేశంలోని రైతాంగం ఆలోచనలో పడుతుంది. రైతులకు కచ్చితంగా రుణ విముక్తి చట్టాన్ని తీసుకొచ్చి అలాగే రైతుకు మద్దతు ధరల చట్టం కూడా తీసుకురావాలని దీనిపై రాష్ట్ర ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని చర్చలు కూడా గట్టిగానే జరుగుతున్నాయి... డాక్టర్ స్వామినాథన్ కమిషన్ ప్రకారం రైతుకు 50 శాతం పెట్టుబడుల కలిపి మద్దతు ధరను ప్రకటించాలని నిర్ణయించిన ఆ దిశగా చర్యలు జరగట్లేదని కనీసం ఈసారైనా రాష్ట్ర ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి ధైర్య సాహసాలతో అడుగేస్తున్న ఈ తరుణంలో ప్రధాన మంత్రి గారితో కలిసి కూడా రైతుకు మద్దతు ధర చట్టం రుణ విముక్తి చట్టాన్ని చట్టపరంగా చేసేలా పార్లమెంటులో పోరాటాన్ని చేయాలని రైతు సంఘాల నాయకులు కోరుతున్నారు. అంతేకాదు బిజెపి ప్రభుత్వం వ్యవసాయ ధర దానికి సంబంధించిన విత్తనాలపైన మందులపైన పరికరాల పైన గ్రిప్ పైన కూడా జిఎస్టి ని పెట్టి రైతుల నుంచి రక్తాన్ని పీలుస్తుందని ఇలాంటి చర్యలకు ఇకనైనా కేంద్ర ప్రభుత్వం స్వస్తి పలికి రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న రైతు రుణమాఫీ లాంటి చారిత్రాత్మకమైన విజయాలను పరిగణలోకి తీసుకొని బిజెపి ప్రభుత్వం చట్టాలను ఏర్పాటు చేయాలని రైతు సంఘ నాయకులు రైతు సంఘ పోరాట ప్రతినిధులు ఆశాభావాన్ని వ్యక్తం చేస్తున్నారు.
రాష్ట్రంలో రైతు సంక్షేమానికి పెద్దపీట వేస్తున్న సీఎం రేవంత్ రెడ్డి పై ప్రశంసల జల్లులతో పాటు విమర్శన వస్త్రాలు ఎన్నోస్తున్న లెక్కచేయకుండా రైతు సంఘాల నుంచి భారీగా మద్దతు లభిస్తోంది. అలాగే కేంద్ర ప్రభుత్వం 21 22 సంవత్సరంలో ప్రపంచ స్థాయి దృష్టిని మల్లెల రైతాంగ పోరాటాలు జరిపించిన వారితో చర్చలు జరిపిన ఆనాటి ఈనాటి ప్రధానమంత్రి మోడీ తాను ఇచ్చిన హామీలు తుంగలో తొక్కారని రాష్ట్ర ప్రభుత్వం తరపున సీఎం రేవంత్ రెడ్డి పార్లమెంటు సమావేశాల్లో కచ్చితంగా రైతుకు మద్దతు ధరల గ్యారెంటీ చట్టం రైతు రుణ విముక్తి చట్టాన్ని అమలుపరిచేలా చర్యలు తీసుకోవాలని పలువురు నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

# కిడ్నీస్.. ఫర్ సేల్...



✍ జయభేరి, గుంటూరు, జూలై 18:

గుంటూరు కిడ్నీ రాకెట్ కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. కిడ్నీలా.. ఇడ్లీలా? 30 రూపాయలకు ప్లేట్ ఇడ్లీ అన్నంత ఈజీగా 30లక్షలకు ఓ కిడ్నీ అంటూ దందా చేస్తున్నారు కేటుగాళ్లు. సామాన్యుల కష్టాలను క్యాష్ చేసుకుంటున్నారు. బాధితులను నిందితులుగా చేస్తోన్న నయవంచన ఇప్పుడు మరో లెవల్. ఏపీలో సంచలనం రేపిన కిడ్నీ రాకెట్ కేసుతో సంబంధం ఉన్న నిందితులను అరెస్ట్ చేశారు పోలీసులు. మిగతా వారి కూడా వీలైనంత త్వరగా పట్టుకుంటామని చెప్పారు పోలీస్ అధికారులుగుంటూరు జిల్లాలో కలకలం రేపిన కిడ్నీ రాకెట్ కేసులో కీలక పురోగతి సాధించారు పోలీసులు. బాధితుల ఫిర్యాదు మేరకు కిడ్నీ మార్పిడి రాకెట్‌పై గుంటూరు పోలీసులు విస్తృతంగా విచారణ చేపట్టారు. ఐపీసీ సెక్షన్‌లు 370, 470, 465, 466, 468, 471, 120(బి)తోపాటు మానవ అవయవాల మార్పిడి చట్టంలోని సెక్షన్ 18, 19, 20 కింద కేసు నమోదు చేశారు. ఈ కేసులో ఏ1, ఏ3 ముద్దాయిలను అరెస్ట్ చేశారు పోలీసులు. నిందితులు బాషా, సుబ్రమణ్యంలను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కి తరలించారు పోలీసులు. మరో ముగ్గురి కోసం గాలిస్తున్నట్లు పోలీసులు చెప్పారు. మరోవైపు ఈ రాకెట్‌ను సీరియస్‌గా తీసుకున్న హోంమంత్రి వి అనిత గుంటూరు ఎస్పీ, విజయవాడ పోలీసు కమిషనర్‌తో పాటు గుంటూరు, ఎన్టీఆర్ జిల్లాల కలెక్టర్లతో మాట్లాడి సమగ్ర విచారణ జరిపి అందులో ప్రమేయం ఉన్న వారందరినీ పట్టుకోవాలని ఆదేశించారు. నిందితులు ఇద్దరిని అరెస్టు చేసిన గుంటూరు నగరంపాలెం పోలీసులు.. విచారణ అనంతరం న్యాయస్థానం ముందు ప్రవేశపెట్టారు. ఆర్థిక ఇబ్బందులతో మధుబాబు అనే వ్యక్తి కిడ్నీ అమ్ముకున్నాడు. అయితే, డాక్టర్లు, మధ్యవర్తి, కిడ్నీ గ్రహిత తనను దారుణంగా మోసం చేశారని.. రూ. 30 లక్షలు ఇస్తామని చెప్పి లక్ష కూడా ఇవ్వలేదని బాధితుడు మధుబాబు పోలీసులను ఆశ్రయించాడు. ఎడమ వైపు కిడ్నీ తీసుకుంటామని చెప్పి కుడి వైపు కిడ్నీ తీసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశాడు. ప్రస్తుతం తన ఆరోగ్య పరిస్థితి క్షీణించిందని తనకు న్యాయం కావాలని అధికారులను ఆశ్రయించారు. ఈ ఘటనపై అటు ప్రభుత్వం సైతం సీరియస్ అయింది. నిందితులను కఠినంగా శిక్షించాలని ఆదేశించింది. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు.. స్పెషల్ టీమ్స్‌తో విచారణను వేగవంతం చేశారు. మరో ముగ్గురిని కూడా త్వరలోనే పట్టుకుంటామని, దీని వెనుక ఎవరెవరూ ఉన్నారో తేలుస్తామని చెప్పారు డీఎస్పీ మహేష్.

# రైతు రాజ్యమే కాంగ్రెస్ లక్ష్యం

- రుణమాఫీ చారిత్రాత్మక నిర్ణయం
- రేవంత్ సర్కారు ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తుంది
- మేడ్చల్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్




**జయభేరి, మేడ్చల్ :**

రైతు రాజ్యమే లక్ష్యంగా రేవంత్ రెడ్డి నేతృత్వం లోని కాంగ్రెస్ పార్టీ సర్కారు పనిచేస్తుందని మేడ్చల్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్ అన్నారు. గురువారం నాడు మేడ్చల్ లోని రాయిలాపూర్ రైతు వేదిక వద్ద నిర్వహించిన కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన రైతు రుణమాఫి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ రేవంత్ రెడ్డి తీసుకున్న రుణమాఫి నిర్ణయం చారిత్రాత్మక నిర్ణయమని అన్నారు. రైతు రుణమాఫిని దశలవారీగా రెండు లక్షల రుణమాఫిని ఆగష్టు నెలలోపే పూర్తి చేస్తామని ఇచ్చిన హామీని కచ్చితంగా నేరవేరుస్తారని అన్నారు. అదే విధంగా ఎన్నికలలో ఇచ్చిన ప్రతి హామీని రేవంత్ సర్కారు పూర్తి చేస్తుందని తెలిపారు. దేశంలోనే ఎన్నడులేనివిదంగా ఏకకాలంలో రైతులకు రుణమాఫీ చేయడం ఒక చరిత్ర అని వజ్రేశ్ యాదవ్ తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాన ఎప్పటికి మరిచిపోదని, నేటి రుణమాఫీతో అది నిజమైందన్నారు. రుణమాఫీ చేసినందుకు దేశ ప్రతిపక్ష నాయకులు రాహుల్ గాంధీకి, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లకు రైతుల తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నానన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని ఇస్తానని చెప్పిన సోనియా గాంధీ ప్రత్యేక రాష్ట్రాన్ని ఇచ్చిందని, అదేవిదంగా రైతు రుణమాఫీ చేస్తానని మాట ఇచ్చిన రాహుల్ గాంధీ ఈరోజు రైతులకు రుణమాఫీలు చేస్తున్నామని కొనియాడారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు అన్ని తప్పకుండా అమలు చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి మేడ్చల్ మండల్ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శిలు, సీనియర్ నాయకులు, మాజీ ప్రజా ప్రతినిధులు,మాజీ ఎంపీటీసీలు సర్పంచులు, కౌన్సిలర్లు, తదితరులు పాల్గొన్నారు.





# అన్నా నాది అంత రెడీమేడ్

- ఎంపీ ఈటల సమక్షంలో ఎమ్మెల్యే మల్లారెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు

**జయభేరి, మేడ్చల్ :**

తన మాటలతో నిత్యం ఏదో ఒక వివాదాస్పద వ్యాఖ్యలతో మాజీ మంత్రి మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి వార్తల్లో నిలుస్తున్నారు. గురువారం గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలో ప్రభుత్వం చేపట్టిన వన మహోత్సవ కార్యక్రమంలో ఎంపీ ఈటల రాజేందర్ తో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మల్లారెడ్డి ఎంపీ ఈటల రాజేందర్ కు స్వాగతం పలుకుతూ "నువ్వు పెళ్లి కొడుకు నేను తోడి పెళ్ళి కొడుకు "అంటూ నవ్వుతూ శాలువతో స్వాగతం పలికారు. అనంతరం మొక్కలు నాటే క్రమంలో ఎంపీ ఈటల మొక్కల గురించి ప్రస్తావిస్తున్న సమయంలో మల్లారెడ్డి స్పందిస్తూ "అన్నా నాది ఏదైనా రెడీమేడ్ నీలాగా పని చేస్తూ రాలేదు" అంటూ ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశారు. దింతో నవ్వడం అక్కడున్న వారి వంతు అయింది. ఎంపీ ఎన్నికల సమయంలో ఎమ్మెల్యే మల్లారెడ్డి ఈటల రాజేందర్ తో ఇలాంటి వ్యాఖ్యలు చేసి బిఆర్ఎస్ పార్టీని ఇరుకునపెట్టారు.

# పీర్ల పండుగ సంబరాల్లో మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి

- పీర్ల కొట్టం నిర్మాణంకి సహకరించిన తుడిమెల్ల మల్లికార్జున్ కి ముస్లింల కృతజ్ఞత



**జయభేరి, జవహర్ నగర్:**

పీర్ల పండుగ సందర్భంగా మల్కాజిగిరి నియోజకవర్గం కౌకూర్ లో సంబరాలు అంబరాన్నంటాయి. కౌకూర్ లో ప్రతి సంవత్సరం పీర్ల పండుగను స్థానికులు ఘనంగా నిర్వహింస్తుంటారు. అయితే పీరీలు పెట్టేందుకు గతంలో నిర్మించబడి వున్న స్థావరం పూర్తగా కూలిపోయి శిథిలావస్థకు చేరడంతో పండగ జరపుకోడానికి స్థానికులు ఇబ్బంది పడ్డారు. ఈ విషయంపై సహాయం కోరుతు కాంగ్రెస్ నాయకుడు తుడిమెల్ల మల్లికార్జున్ దృష్టికి స్థానిక ప్రజలు తీసుకువెల్లడంతో స్పందించిన ఆయన వెంటనే నిర్మాణం చేయించారు. మల్లికార్జున్ దగ్గరుండి పీర్ల పండుగ సంబరాలకు సహకారించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే.. కాంగ్రెస్ నాయకుడు మైనంపల్లి హన్మంత్ రావ్ హాజరయ్యారు. అనంతరం పీరీలకు మొక్కి నిర్వాహకులకు, స్థానిక ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేసారు. సమస్యను చెప్పగానే వెంటనే స్పందించి నిర్మాణానికి సహకరించిన తుడిమెల్ల మల్లికార్జున్ కి స్థానికులు కృతజ్ఞతలు తెలియజేసారు.

# నోటిసులు జారీ చేసిన స్పందించని కాలని వాసులు

- అక్రమ నిర్మాణాలను ఉపేక్షించేది లేదని మున్సిపల్ కమిషనర్ హెచ్చరిక



**జయభేరి, జులై 18:**

మేడ్చల్ జిల్లా తుంకుంట మున్సిపల్ పరిధిలోని ఎం ఎం రెడ్డి కాలనిలో ప్రధాన రహదారిపై అక్రమంగా షెడ్డును నిర్మించారు. అయితే ఈ షెడ్డును తొలగించాలని గతంలో అధికారులు కాలని వాసులకు నోటీసులు జారీ చేశారు. అయినా వారు బేఖాతరు చేస్తూ వచ్చారు. అంతే కాకుండా వారు అడిగిన సమయం కూడా అధికారులు ఇచ్చినా కూడా వారు షెడ్డుని తొలగించకుండా నిర్లక్ష్యం వహించారు. దీంతో రంగం లోకి దిగిన జిల్లా టాస్క్ ఫోర్స్ సిబ్బంది పోలీసుల సహకారంతో రహదారిపై అక్రమంగా నిర్మించిన షేడ్డును తొలగించారు. ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మించిన షెడ్డును తొలగించినట్లు, ప్రధాన రహదారులను ఆక్రమించి ఎలాంటి నిర్మాణాలు చేపట్టిన ఊరుకునేది లేదని మున్సిపల్ కమిషనర్ వెంకట గోపాల్ హెచ్చరించారు.

# రైతు రుణమాఫీ సంబరాలు

- రైతులకు ఇచ్చిన మాటకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉంది.. మాజీ వైస్ ఎంపిపి శ్రీనివాస్ రెడ్డి



**జయభేరి, జులై 18 :**

కాంగ్రెస్ పాలనలోనే రైతులకు మేలు జరుగుతుందని మూడుచింతలపల్లి మాజీ వైస్ ఎంపీపీ శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మేడ్చల్ జిల్లా మూడుచింతలపల్లిలోనీ రైతు వేదికలో రైతు రుణమాఫీ సంబరాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపిపి మాట్లాడుతూ గత ప్రభుత్వాలు రైతులను అన్యాయం చేశాయని ఆరోపించారు. 9 ఏళ్లు పాలన చేసిన బీఆర్ఎస్ ప్రభుత్వం రైతుల గురించి ఆలోచించకుండా రైతులకు రుణమాఫీ చేయకుండా వారిని గాలికి వదిలేసిందన్నారు. ఇప్పుడు ఎప్పుడు రైతులను ఆదుకునీ వారికి మేలుచేసింది కేవలం కాంగ్రెస్ ప్రభుత్వమేనని చెప్పారు. కాగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతులకు లక్ష రూపాయల రుణమాఫీ చేసిన సందర్భంగా ఆయన చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పిటీసీ హరివర్ధన్ రెడ్డి. తహసీల్దార్, వెంకటనర్సింహారెడ్డి, ఎంపీడీవో వత్సలాదేవి, ఏవో కృష్ణవేణి, డిప్యూటీ తాసిల్దార్ నాగజ్యోతి, ఆర్ ఐ రాఘవ, మండల అధ్యక్షుడు తదితరులు పాల్గొన్నారు.



# రేవంత్ సర్కార్ దారుణమైన మోసం

- షేక్ ఇస్మాయిల్

**జయభేరి, కొండ మల్లేపల్లి :**

తెలంగాణ విద్యార్థులను అలాగే రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం దారుణంగా మోసం చేస్తుందని బిఆర్ఎస్ పార్టీ యువజన నాయకులు షేక్ ఇస్మాయిల్ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించారు. జూన్ నెలలోనే రైతు బంధు (రైతు భరోసా) పథకం కింద రైతులకు ఇవ్వాల్సిన సుమారు రూ. 11,500 కోట్ల డబ్బు ఇవ్వకుండా ఆపి ఇప్పుడు అందులోంచే రూ. 7,000 కోట్లు రైతు రుణమాఫీకి ఇస్తున్నారని రైతులకు రావాల్సిన డబ్బు ఒక జేబులోని ఇంకో జేబులోకి మార్చి, తామే ఇచ్చినట్టు బిల్డప్పు ఇస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం తీరును ప్రజలు గమనించాలని కోరారు.

# సీఎం చిత్రపటానికి పాలాభిషేకం



**జయభేరి, దేవరకొండ :**

గ్రామీణ వైద్య నిపుణులు (ఆర్ఎంపి), పారామెడికల్ ప్రాక్టీషనర్లు (పిఎంపి) లకు ఉచిత నైపుణ్య శిక్షణ ఇచ్చి, సర్టిఫికెట్లు ఇస్తామని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించడం పట్ల దేవరకొండ మండల సుశ్రుత గ్రామీణ వైద్యుల సంఘం అధ్యక్షులు మలిపెద్ది లక్ష్మీనారాయణ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సంఘం సభ్యులతో కలిసి దేవరకొండ అంబేద్కర్ విగ్రహానికి పూల నివాళులు అర్పించారు. అనంతరం తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, వైద్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ, కుందూరు రఘువీర్ రెడ్డి దేవరకొండ శాసనసభ్యులు నేనావత్ బాలు నాయక్ చిత్రపటానికి పాలభిషేకం నిర్వహించి మాట్లాడారు. ఆర్ఎంపీలకు శిక్షణ ఇచ్చేందుకు వెంటనే నిధులు విడుదల చేసి గ్రామీణ వైద్యులను ఆదుకోవాలని అన్నారు. తరతరాల నుంచి వస్తున్న గ్రామీణ వైద్యుల వ్యవస్థను కొనసాగించి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించే విధంగా ప్రభుత్వం ఉత్తర్వులు ఇవ్వాలని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో సుశ్రుత గ్రామీణ వైద్యుల సంఘం ఉపాధ్యక్షులు ఎర్ర బిక్షపతి, కోశాధికారి దువ్వ వెంకటేశ్వర్లు, ప్రచార కార్యదర్శి హనుమంతు, కార్యవర్గ సభ్యులు సయ్యద్ అక్బర్, రాంబాబు, నిరంజన్ (బాబా), మల్లేష్, రత్నారావు, రవి, జుబేర్, రూప్ సింగ్, శంకర్, ఎల్లయ్య, కుమార్, రిజ్వాన్, రాజేశ్వర్ రావు, వెంకటేశ్వర్లు కుమారస్వామి, పంతులాల్ తదితరులు పాల్గొన్నారు.

# తహశీల్దార్ కు వినతిపత్రం సమర్పణ

- కీసర తహసీల్దార్ కార్యాలయం ముందు ముదిరాజ్ నేతల ఆందోళన
- ముదిరాజ్ లను బిసిడి నుండి బిసిఏ లోకి మార్చాలని డిమాండ్




**జయభేరి, జులై 18:**

ముదిరాజ్ లను బి సి డి నుండి బీసీఏ లకు మారుస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కోరుతూ మేడ్చల్ జిల్లా కీసర తహసీల్దార్ కార్యాలయం ముందు మండల ముదిరాజ్ నేతలు ఆందోళన చేపట్టారు. అనంతరం తహసీల్దార్ కు నేతలు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రాష్ట్ర యువత ఉపాధ్యక్షుడు బాలు మాట్లాడుతు కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ముదిరాజ్ కులస్తులను బిసి డి నుండి బిసి ఎ లోకి మారుస్తామని ఇచ్చిన మాటకు కట్టుబడి తక్షణమే ఆ హామీని నిలబెట్టుకోవాలని కోరారు. ఉద్యోగ నియామకాల నోటిఫికేషన్ విడుదల అయిన నేపథ్యంలో నిరుద్యోగులు ఉద్యోగ అవకాశాలు కోల్పోవాల్సి వస్తుందని అన్నారు . అదేవిధంగా మత్స్యకారులకు చేప పిల్లలు అందించాలని, 50 సంవత్సరాల పైబడిన మత్స్యకార్మికులకు పెన్షన్ సదుపాయం కల్పించాలని డిమాండ్ చేశారు.

# మాజీ మంత్రి వర్యులు గుంటకండ్ల జగదీశ్ రెడ్డి జన్మదిన వేడుకలు



**జయభేరి, దేవరకొండ :**

దేవరకొండ పట్టణంలో ఘనంగా మాజీ విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీష్ రెడ్డి జన్మదిన వేడుకలు నిర్వహించడం జరిగింది. ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్యే రవీంద్ర కుమార్ పాల్గొని కేక్ కట్ చేశారు. నల్గొండ జిల్లా అభివృద్ధి ప్రధాత నిరంతరం ప్రజా సేవకై కృషి చేస్తు నేనున్నా అని అభయం ఇచ్చే మహోన్నత వ్యక్తి తెలంగాణ రాష్ట్ర మాజీ విద్యుత్ శాఖ మంత్రి వర్యులు గుంటకండ్ల జగదీష్ రెడ్డి అని ఆయన అన్నారు. ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో మీరు చిరకాలం ప్రజాసేవలో కొనసాగాలి అని ఆయన ఆకాంక్షించారు. నిండు నూరేళ్లు ఆయువు ఆరోగ్యాలతో విరాజిల్లాలని ఆ భగవంతుణ్ణి కోరుకోవడం జరిగింది. ఉమ్మడి నల్గొండ జిల్లాకు మాజీ మంత్రి కృషితోనే రెండు మెడికల్ కాలేజీలు మంజూరు కావడం జరిగింది అని అన్నారు. ఆనాటి ఉద్యమ సమయం నుంచి నేటి వరకు బిఆర్ఎస్ పార్టీకి రథ సారధిగా వహించి జిల్లా రూపురేఖలను మార్చిన మహోన్నత వ్యక్తి మాజీ మంత్రి జగదీశ్వర్ రెడ్డి అని ఆయన అన్నారు. ఈకార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ చింతపల్లి సుభాష్‌గౌడ్, బిఆర్ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షులు వేముల రాజు, బి ఆర్ ఎస్వి దేవరకొండ నియోజకవర్గం అధ్యక్షులు బొడ్డుపల్లి కృష్ణకేతావత్ శంకర్ నాయక్, మాజీ సర్పంచ్ రేపాని ఇద్దయ్య, పొట్ట మురళి, ఇలియస్ పటేల్, మాజీ ఉపసర్పంచ్ రమావత్ తూలిసిరామ్ నాయక్, వాడిత్య బాలు, సత్తార్, పగిడిమర్రి నాగరాజు, పగిడిమర్రి సతీష్, చంద్రమౌళి (సీ ఎం) నజీర్, లెండల లాక్ష్మీ కాంత్, జమిర్, మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.

# విశ్రాంత ఉద్యోగుల దాన గుణం




**జయభేరి, దేవరకొండ :**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం దేవరకొండ సభ్యులు స్థానిక బీద కుటుంబాలవారికి పుట్టినరోజు, పెళ్లిరోజుల సందర్భంగా సహాయం చేయడం సంతోషకరం అని అధ్యక్ష, కార్యదర్శి, కోశాధికారి తాడిశెట్టి నరసింహ, అంకం చంద్రమౌళి, పంగునూరు లింగయ్య అన్నారు. గురువారం జూలూరు ఈశ్వరయ్య రిటైర్డ్ మండల అభివృద్ధి అధికారి పుట్టినరోజు సందర్భంగా హరిజనవాడ బీద కుటుంబంనకు 25 కిలోల బియ్యం, నిత్యఅవసరం సరుకులు అందజేసారు. ఈశ్వరయ్య మాట్లాడుతూ మా పెన్షనర్స్ సంఘం పెద్దలు మంచి, మంచి కార్యక్రమాలు చేపట్టి మాకు ఆనందాన్ని కలిగిస్తున్నారని,.సహాయం పొందిన వారు దాతకు కృతజ్ఞతలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కంచర్ల నారాయణ రెడ్డి, సహ అధ్యక్షులు గంగిడి దామోదర్ రెడ్డి, ఆడిటర్ వనం బుచ్చయ్య, కార్యవర్గం సభ్యులు మునిని వీరయ్య, చారి, లక్ష్మ నాచారి, మల్లయ్య, వనం నర్సింహా తదితరులు పాల్గొన్నారు.

# రైతు వేధిక వద్ద రుణమాఫీ సంబరాలు

- రైతులకు రుణభారం తగ్గించడం కోసం ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడి.. జిల్లా కలెక్టర్ గౌతమ్

**జయభేరి, జులై 18:**

రైతు రుణమాఫీ విడుదల సందర్భంగా మేడ్చల్ జిల్లా శామీర్ పేట్ మండలం అలియాబాద్ గ్రామం లోని రైతు వేధిక వద్ద సీఎం రేవంత్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ గౌతమ్ మరియు రైతులు పాల్గొన్నారు . ఈ సందర్భంగా కలెక్టర్ గౌతమ్ మాట్లడుతూ రైతు రుణమాఫీ అనేది రైతులకు ఒక పండగ లాంటిదని అన్నారు. రైతులకు రుణభారం తగ్గించడం కోసం ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.





మొదటి విడతలో లక్ష రూపాయలు, రుణమాఫీ జరుగుతుందని తెలిపారు. అయితే రుణమాఫీ కాలేదని రైతులు అధైర్య పడవద్దని రుణమాఫీ కానీ రైతులకు 2,3 విడతల్లో జరుగుతుందని కలెక్టర్ గౌతమ్ స్పష్టం చేశారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యం లో రైతులు రుణాల కోసం రెన్యువల్ చేసుకోవాలనీ సూచించారు. ఏవైనా సందేహాలు ఉన్నట్లయితే జిల్లా, మండల వ్యవసాయ అధికారులు అందుబాటులో ఉంటారని వారి వద్దకు నేరుగా వెళ్లి సలహాలు తీసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో శామీర్ పేట మండల ప్రత్యేక అధికారి సైదులు, జిల్లా వ్యవసాయ అధికారి రేఖ మేరి, మండల వ్యవసాయ అధికారి రమేష్,సంబంధిత అధికారులు తదితరులు పాల్గోన్నారు.



## ఆగస్టు 1వ తేదీ వరకు దరఖాస్తు

- శామీర్ పేట్ లోని ఐటిఐ కళాశాలలో 2024 విద్యా సంవత్సరానికి దరఖాస్తులు ఆహ్వానం
- కళాశాల ప్రిన్సిపల్ వి. లలిత

**జయభేరి, జులై 18:**

మేడ్చల్ జిల్లా శామీర్ పేట్ లోనీ ఐటిఐ కళాశాలలో 2024 విద్యా సంవత్సరానికి గాను రెండవ విడత ప్రవేశాలకు దరఖాస్తులను ఆగస్టు 1వ తేదీ వరకు పొడగిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ వి. లలిత పేర్కోన్నారు. ఎలక్ట్రిషియన్ , ఫిట్టర్, కంప్యూటర్ ఆపరేటింగ్ , మరియు ప్రోగ్రామింగ్ అసిస్టెంట్ పోస్టులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. 10 తరగతి పాసైన ఆసక్తి కలిగి ఉన్న విద్యార్థులు ఈ నెల 21 వ తేదీ లోపు https://WWW.ititelangana.in వెబ్ సైట్ లో దరఖాస్తు చేసుకోవాలనీ వారు సూచించారు.

## జులై 28న అంగరంగ వైభవంగా బోనాల జాతర

- బోనాలకు ముస్తాబవుతున్న పర్వతాపురం గ్రామం



**జయభేరి, మేడిపల్లి :**

పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పర్వతాపురంలో బోనాల జాతర జులై 28న జరుపుకొనుటకు నిర్ణయించినారు. 5వ డివిజన్ కార్పొరేటర్ బొడిగె స్వాతి కృష్ణ గౌడ్ అధ్యక్షతన వారి కార్యాలయంలో జరిగిన సమావేశంలో 3వ డివిజన్ కార్పొరేటర్ బైటింగ్ శారద ఈశ్వర్ రెడ్డి, 4వ డివిజన్ కార్పొరేటర్ యాసారం మహేశ్వరి మహేష్, కో ఆప్షన్ మెంబర్లు బొడిగె రాందాస్ గౌడ్, చిలుముల జగదీశ్వర్ రెడ్డి, గ్రామ పెద్దలు, వత్తందారులు, కుల పెద్దలు మాజీ వార్డు సభ్యులు, పుర ప్రముఖులు తీర్మానించారు. ఆగస్టు 4న అమావాస్య ఉండడం వలన బోనాల జాతర తేదీని మార్చబడినది, కావున భక్తులందరూ అన్యతగా భావించవద్దని పెద్దలు అందరూ కలిసి తీర్మానించిన విధంగా జులై 28న అంగరంగ వైభవంగా ప్రతిసారి లాగే ఈసారి కూడా బోనాల జాతర 5వ డివిజన్ లోని అమ్మవారి దేవాలయాల్లో స్థానిక కార్పొరేటర్ బొడిగె స్వాతి కృష్ణ గౌడ్ ఆధ్వర్యంలో రంగులు వేయడం, విద్యుత్ దీపాల కరణ, పరిశుభ్రత అమ్మవారి ఆలయాల్లో అలంకరణ, పెద్ద సంఖ్యలో తరలి వచ్చే భక్తుల కోసం అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయడం జరుగుతుందని వారు తెలియజేశారు. బోనాల జాతర తేదీ మార్పుపై పెద్దలందరూ కలిసి తీసుకున్న నిర్ణయం పై ప్రజలందరూ సహకరించి అమ్మవారి జాతర మన గ్రామంలో ఎంతో వైభవంగా జరుపుకోవాలని కోరుకుంటున్నాను.

## నూతన రుణాలను మంజూరు చేయడం కోసం..



**జయభేరి, మేడిపల్లి :**

ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నాగరిగారి ప్రీతమ్ కి శుభాకాంక్షలు తెలిపి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో పలు డిమాండ్ల పరిష్కారానికై విజ్ఞప్తి చేసిన MRPS మేడ్చల్ జిల్లా అధ్యక్షులు పంగ ప్రణయ్ కుమార్ మాదిగ. ఈ సందర్భంగా పంగ ప్రణయ్ మాట్లాడుతూ... పలు డిమాండ్లు కార్పొరేషన్ చైర్మన్ ముందు పెట్టారు. ముఖ్యంగా జిల్లా పరిధిలో గతంలో పెండింగ్ లో ఉన్న కార్పొరేషన్ లోన్స్ ప్రక్రియ త్వరతగిన పూర్తిచేసి నిధులు విడుదల చేసేలా చర్యలు తీసుకోవాలని గతంలో పెండింగ్ లో ఉన్న ఎస్సీ కార్పొరేషన్ రుణాల ఫైల్స్ క్లియర్ చేసి సబ్సిడీ డబ్బులు విడుదల అయ్యేలా కృషి చెయ్యాలని ఎస్సీ సబ్ ప్లాన్ నిధులు కేటాయించి మాదిగ కాలనీల లో మౌలిక సదుపాయాలు కల్పించడం.. జనాభా ప్రాతిపదికన మాదిగలకు 75% నిధులు కేటాయించడం.. నూతన రుణాల మంజూరు కోసం తక్షణమే నోటిఫికేషన్ ఇవ్వడం.. గత కొన్నేళ్లుగా పెండింగ్ లో ఉన్న ఎస్సీ కార్పొరేషన్ నిధులు విడుదల కాకపోవడం వల్ల లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కనుక తక్షణమే నిధులు విడుదల చేసి లబ్ధిదారులకు అందేలా చూడాలని కోరుతున్నాం. అలాగే మేడ్చల్ జిల్లాలో ఎస్సీ కార్పొరేషన్ ద్వారా జనాభా ప్రాతిపదికన 75% నిధులను మాదిగలకు కేటాయించేలా నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నాం. గతంలో జనాభాకు తగిన స్థాయిలో రుణాలు అందకపోవడం వల్ల మాదిగలకు తీవ్ర న్యాయం జరిగింది. తమరి హయాంలో మాదిగలకు న్యాయం చేయాలని కోరుతున్నాం. ఇకపోతే మాదిగ వాడలు అనేక సమస్యలకు నిలయాలుగా ఉన్నాయి. వాటి పరిష్కారం కోసం మౌలిక సదుపాయాలను కల్పించడానికై ఎస్సీ సబ్ ప్లాన్ బడ్జెట్ ను విడుదల చేయాలని కోరుతున్నాం. తద్వారా రోడ్లు, డ్రైనేజీ, వాటర్ ట్యాంకు నిర్మాణాలతో పాటుగా ప్రతి మాదిగ వాడలో కమ్యూనిటీ హాల్ ల నిర్మాణం చేపట్టాలని కోరుతున్నాం. అలాగే నూతన రుణాలను మంజూరు చేయడం కోసం కూడా తక్షణమే నోటిఫికేషన్ విడుదల చేయాలని విజ్ఞప్తి చేస్తున్నాం. ఈ కార్యక్రమంలో మేడిపల్లి మండల MRPS అధ్యక్షులు బండారి సాయి, నవీన్, కరుణాకర్ క్యాసగాళ్ళ, గౌతమ్, ఉదయ్ కిరణ్, సంపత్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.











బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ కొత్తగా ఎన్నికైన మేయర్ తోటకూర అజయ్ యాదవ్ ని కలవడం జరిగింది. ఏడవ డివిజన్ సమస్యల గురించి మాట్లాడడం జరిగింది. ఈ సమస్యల మీద మేయర్ సానుకూలంగా స్పందించి అతి త్వరలో ఈ సమస్యలకు పరిష్కారం చేస్తానని హామీ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆంజనేయ నగర్, గాయత్రి నగర్ ,వెంకటేశ్వర కాలనీ, కేశవ నగర్ కాలనీ సాయి మారుతి నగర్ కాలనీ వాసులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

**జయభేరి, మేడిపల్లి**



మేడ్చల్ జిల్లా పీర్జాదిగూడ కార్పొరేషన్ మేయర్ జక్క వెంకట్ రెడ్డి పై అవిశ్వాసం నోటిస్ అందచేసిన కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్లు. గురువారం నాడు మేడ్చల్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ గౌతమ్ కు కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్లు అవిశ్వాసం నోటిస్ అందచేశారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్, మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్ రెడ్డి, డిప్యూటీ మేయర్ కుర్ర శివకుమార్ గౌడ్, మాజీ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దర్గా దయాకర్ రెడ్డిలతో పాటు కార్పొరేటర్లు పాల్గొన్నారు.

**జయభేరి, మేడిపల్లి :**




## ఉపాధ్యాయ బృందం సేవలు మరుపురానివి

- కార్పొరేటర్ దొంతిరి హరి శంకర్ రెడ్డి

**జయభేరి, మేడిపల్లి :**

పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మేడిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు ఉపాధ్యాయులు బదిలీలపై వేర్వేరు పాఠశాలలకు వెళ్లిన సందర్భంగా గురువారం సాయంత్రం స్థానిక 25వ డివిజన్ కార్పొరేటర్ దొంతిరి హరి శంకర్ రెడ్డి వారు అందించిన సేవలకు గాను అందరిని ఘనంగా శాలువాతో సన్మానించి, ముమెంటో అందించారు. అలాగే నూతనంగా పాఠశాలకు బదిలీలలో విచ్చేసిన ఉపాధ్యాయులను కూడా సన్మానించారు. అనంతరం వారందరితో కలసి సంపహక్తి భోజనం చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ హరి శంకర్ రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థుల భవిష్యత్ కై అహర్నిశలు పాటు పడిన ఉపాధ్యాయ బృందం యొక్క సేవలు మరుపురానివని కొనియాడారు. అలాగే భవిష్యత్తులో ఉన్నత స్థానంలో వుంటూ క్రమశిక్షణ లతో చదివి మన పాఠశాలను జిల్లా స్థాయి రాష్ట్ర స్థాయిలో మొదటగా నిలపాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సత్యప్రసాద్, 25వ డివిజన్ కాలనీల అధ్యక్ష కార్యదర్శులు ఉపాధ్యాయులు విద్యార్థులు తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.






తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన రుణమాఫీ నేపథ్యంలో కొందరు సైబర్ నేరస్థులు ఎదో బ్యాంకు పేరిట వాట్సాప్ ప్రొఫైల్ బ్యాంకు పేరు, పిక్చర్ బ్యాంకు లోగో తో వాట్స్ యాప్ లో APK files పంపిస్తున్నారు. దీన్ని మనము accept చేస్తే మన వాట్స్ యాప్ వాళ్ళ కంట్రోల్ కీ వెళ్లి పోతుంది, అంతే కాకుండా మన కాంటాక్ట్స్ లో వున్న ప్రతి ఒక్కరికి మెసేజ్ వెళ్తున్నది. దీని ద్వారా సైబర్ నేరస్థులు మన Google Pay / Phone Pay, UPI ద్వారా డబ్బులు దోచేస్తున్నారు. ట్రేండింగ్ లో వున్న టాపిక్ ద్వారా APK Files పంపి డబ్బులు కొట్టేస్తున్నారు. కాబట్టి అందరికి మనవి చేసేది ఏమంటే ఏదయినా apk files వస్తే మీరు ఎట్టి పరిస్థితిలో ఓపెన్ చెయ్యకూడదు. మీ వాట్స్ యాప్ పనిచేయకుంటే వెంటనే రిఇంస్టాల్ చేసి report ఆప్షన్ లో రిపోర్ట్ చెయ్యండి. ఎవరైనా ఏదయినా నేరానికి గురి అయితే వెంటనే ఎలాంటి ఆలస్యం చెయ్యకుండా #1930 కీ కాల్ చెయ్యండి లేదా www.cybercrime.gov.in లో రిపోర్ట్ చెయ్యండి.

**- నూకల వేణు గోపాల్ రెడ్డి, DSP సైబర్ సెక్యూరిటీ బ్యూరో**

# మూవీభేరి

## 24ఏండ్ల జీవితం మట్కా

వరుణ్ తేజ్ కథానాయకుడిగా రూపొందుతోన్న పీరియాడిక్ పాన్ ఇండియా యాక్షన్ డ్రామా 'మట్కా'. కరుణకుమార్ దర్శకుడు. డాక్టర్ విజయేందర్‌రెడ్డి తీగల, రజనీ తాళ్లూరి నిర్మాతలు. 1958 నుంచి 1982వరకూ అంటే, ఇరవైనాలుగేండ్లపాటు సాగే కథతో, ఊహించని మలుపులతో సాగే చిత్రమిది. ఇప్పటికే హైదరాబాద్ ఆర్ఎఫ్‌సీలో కీలకమైన భారీ షెడ్యూల్ పూర్తయింది. పాతకాలం నాటి వైజాగ్‌ని తలపించేలా నిర్మించిన మ్యాసీవ్ సెట్‌లో కథలోని కీలక సన్నివేశాలతోపాటు, భారీ యాక్షన్ ఎపిసోడ్స్‌నీ.. అలాగే రెట్రో థీమ్ సాంగ్స్‌ని మేకర్స్ చిత్రీకరించారు. ప్రమోషన్‌లో భాగంగా ఇందులో ఓ కథానాయికగా నటిస్తున్న నోరా ఫతేహీ పోస్టర్‌ని కూడా విడుదల చేశారు. నోరా డాన్సులు సినిమాకు హైలైట్‌గా నిలుస్తాయని, ముఖ్యంగా జానీ మాస్టర్ కొరియోగ్రఫీలో చేసిన పాటను నంబర్ ఆఫ్ డాన్సర్‌తో గ్రాండ్‌గా షూట్ చేశామని, ప్రస్తుతం కొత్త షెడ్యూల్ వైజాగ్‌లో శరవేగంగా జరుగుతున్నదని మేకర్స్ తెలిపారు. మీనాక్షి చౌదరి మరో కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో నవీన్‌చంద్ర, అజయ్‌ఘోష్, కన్నడ కిశోర్ తదితరులు ఇతర పాత్రధారులు. ఈ చిత్రానికి కెమెరా: ఏ.కిశోర్‌కుమార్, సంగీతం: జి.వి.ప్రకాశ్‌కుమార్, నిర్మాణం: వైర ఎంటర్‌టైన్‌మెంట్స్, ఎస్ఆర్‌టి ఎంటర్‌టైన్‌మెంట్స్.





## తెలివైన సమాధానమిచ్చింది

రచయిత, సహాయ దర్శకుడు రాహుల్ మోడితో నటి శ్రద్ధా కపూర్ అనుబంధంలో ఉన్నట్టు చాలా రోజులుగా బీటౌన్‌లో ప్రచారం జరుగుతున్నది. అతనితో కలిసి శ్రద్ధా దిగిన సెల్ఫీలు కూడా సోషల్ మీడియాలో బాగా వైరల్ అయ్యాయి. 'తూ ఝూఠీ మై మక్కార్' సినిమా టైమ్‌లో వీరిద్దరి మధ్య ప్రేమ చిగురించిందని, త్వరలో ఈ జంట పెళ్లి పీటలు ఎక్కనున్నారని కథనాలు కూడా వెలువడ్డాయి. ఈ నేపథ్యంలో తన తాజా చిత్రం 'స్త్రీ 2' ప్రమోషన్స్‌లో పాల్గొన్న శ్రద్ధకు ఓ విలేకరి ద్వారా తన పెళ్లికి సంబంధించిన ప్రశ్న ఎదురైంది. దీనికి ఆమె తెలివిగా, 'స్త్రీ 2' చిత్రంలోని తన పాత్ర గురించీ, తన గురించీ ఒకే సమాధానం చెప్పేసింది. 'స్త్రీ తనకు ఇష్టమైనప్పుడు ఇష్టమైన వాడ్ని పెళ్లిచేసుకుంటుంది.' అంటూ సింపుల్‌గా తేల్చేసింది శ్రద్ధ. ఇక ఆమె తాజా సినిమా 'స్త్రీ2' విషయానికొస్తే, ఆగస్ట్ 15న స్వాతంత్ర్య దినోత్సవ కానుకగా ఈ సినిమా విడుదల కానుంది. అమర్ కౌశిక్ ఈ చిత్రానికి దర్శకుడు.


## బాలీవుడ్‌లో రామ్ టీం డబుల్ ఇస్మార్ట్ ప్లాన్

టాలీవుడ్ మూవీ లవర్స్ ఆసక్తిగా ఎదురుచూస్తున్న చిత్రాల్లో ఒకటి డబుల్ ఇస్మార్ట్. పూరీజగన్నాథ్ దర్శకత్వం వహిస్తున్నాడు. ఎనర్జిటిక్ యాక్టర్ రామ్ పోతినేని టైటిల్ రోల్‌లో నటిస్తున్న ఇస్మార్ట్ శంకర్‌కు సీక్వెల్‌గా వస్తోంది. కావ్య థాపర్ హీరోయిన్‌గా నటిస్తోన్న ఈ చిత్రం ఆగస్టు 15న ప్రపంచవ్యాప్తంగా తెలుగు, తమిళం, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో గ్రాండ్‌గా విడుదల కానుంది. పాన్ ఇండియా స్థాయిలో ప్రమోషన్స్ ప్లాన్ చేస్తోంది పూరీ టీం. తాజా టాక్ ప్రకారం బాలీవుడ్‌లో డబుల్ ఇస్మార్ట్ ప్రమోషన్స్‌కు రెడీ అవుతున్నారని, ముంబైలో ఓ భారీ ఈవెంట్‌ను నిర్వహించేందుకు రెడీ అవుతుండగా చిత్రయూనిట్ ఇందులో పాల్గొనబోతుందని బీటౌన్ సర్కిల్ టాక్. ఇస్మార్ట్ శంకర్‌కు స్పీకర్ అదిరిపోయే మ్యూజిక్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ అందించిన మెలోడీ బ్రహ్మ మణిశర్మ మరోసారి వర్క్ చేస్తుండటం అంచనాలు భారీగానే ఉన్నాయి. డబుల్ ఇస్మార్ట్‌లో బాలీవుడ్ నటుడు సంజయ్ దత్ విలన్‌గా నటిస్తున్నాడు. పూరీ కనెక్ట్స్ బ్యానర్ తెరకెక్కిస్తోన్న ఈ మూవీ ఆడియో హక్కులను పాపులర్ మ్యూజిక్ లేబుల్ ఆదిత్య మ్యూజిక్ సొంతం చేసుకుంది. మాస్ మ్యూజిక్ జాతరలో భాగంగా ఇప్పటికే ఈ చిత్రం నుంచి విడుదల చేసిన STEPPAMAAR, మార్ ముంతా చోడ్ చింతా సాంగ్ సాంగ్స్‌కు నెట్టింట మంచి స్పందన వస్తోంది.



## అవన్నీ అవాస్తవాలు

'పుష్ప 2' సినిమా విషయంలో వినిపిస్తున్న నెగిటివ్ వార్తల్లో నిజం లేదని చిత్ర నిర్మాణ సంస్థ మైత్రీమూవీమేకర్స్ ప్రకటించింది. వివరాల్లోకెళ్తే ఈ సినిమా షూటింగ్ ఆలస్యం అవుతుండటంతో దర్శకుడు సుకుమార్ పనితీరుపై అల్లు అర్జున్ అసంతృప్తితో ఉన్నారని, సినిమా షూటింగ్ కూడా ఆగిపోయిందని, 'పుష్ప' పాత్ర కోసం పెంచిన గడ్డాన్ని బన్నీ ట్రిమ్ చేసుకున్నది కూడా ఇందుకేనని పలు కథనాలు వెబ్ మీడియాలో కనిపిస్తున్నాయి. వీటిని చిత్రబృందం ఖండించింది. 'పుష్ప 2' విషయంలో అలాంటి వాటికి ఏమాత్రం తావు లేదని, సుకుమార్ ఎప్పటి లాగే తన పని తాను చేసుకుంటూ వెళ్తున్నారని, అనుకున్నట్టే డిసెంబర్ 6న 'పుష్ప 2' ఎట్టిపరిస్థితుల్లో విడుదల చేస్తామని మేకర్స్ చెప్పారు. ఇదిలావుంటే.. ఈ నెల 25 నుంచి 'పుష్ప 2' కొత్త షెడ్యూల్ మొదలు కానున్నదట. ఈ నెల 28 నుంచి బన్నీ షూటింగ్‌లో పాల్గొంటారని, ఈ షెడ్యూల్‌లోనే కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తారని సమాచారం. రష్మిక మందన్న కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రానికి దేవిశ్రీప్రసాద్ స్వరాలందిస్తున్న విషయం తెలిసిందే.



Printed and Published & Owned by MOTHE RAGHU THIRUPATHI REDDY, Printed at DOLPHIN GRAPHICS, #24-88/1, L.N. Colony, IDA Uppal, Hyderabad, Medchal-Malkajgiri, telangana-500039.
Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500039. Editor: M. R. Thirupathi Reddy. Cell: 9391 544 889 RNI No: TELTEL12264. email: jayabherinews@gmail.com, www.jayabheridaily.com